కథానిక

# హత్య - ఆత్మహత్య

శ్రీ రాగి

ఉదయం పదిగంటలు. సూర్యుడు ఆకాశంలో క్రమంగా పైకి ఎగబ్రాకుతున్నాడు. అదొక చిన్న గ్రామం. అంతా అయిదారువేల గడప కంటె ఎక్కువుండదు. సామాన్యంగా ఆ గ్రామం ప్రశాంతంగానే వుంటుంది. కాని ఈ రోజున ఉన్నట్టుండి అలజడి బయలుదేరింది.

ఈ వూరికి కృష్ణకాల్వ అరమైలు దూరంలో ప్రవహిస్తూ వుంటుంది.

ఉరకలుతీస్తున్న సుబ్బయ్యను పుల్లయ్య చేయి పట్టుకుని ఆపాడు. సుబ్బయ్య రొప్పుతున్నాడు ఆయాసంతో.

"ఏమిటి సుబ్బయ్యా, ఒకటేమయిన లగెత్తుతున్నావు?" అన్నాడు పుల్లయ్య.

"ఓరి! నీకింకా తెలియదట్రా?" ఆశ్చర్యం వెలిబుచ్చాడు సుబ్బయ్య.

"ఏమిటిరా అది?" ఆత్రంతో ప్రశ్నించాడు పుల్లయ్య యేం కొంపమునిగిందో అని.

"ఊరిబయట కాలవలో ఓ శవం కొట్టుకొచ్చిందిట."

"శవమే!" జాలితో మిళితమయిన ఆశ్చర్యం ప్రకటించాడు పుల్లయ్య. "ఎప్పుడు కొట్టుకొచ్చింది. ఎవరు చూశారు?"

"అంతా ఒక గంట క్రిందటరా. మన లాకు దగ్గర పడవవాళ్లు శవం నీళ్ళలో తేలుతూ వస్తూ వుంటే చూసి బయటికి తీశారు."

"అయితే శవం ఎవరిదో గుర్తుపట్టారా?"

"గుర్తుపట్టడానికి వీలుంటేగా. మొహమంతా చెక్కేశారుట!"

"అసలు ఆడమనిషా. మగమనిషా?"

"ఆడమనిషే. పాతికేళ్లుండొచ్చుట."

"అయితే మన మున్సబుగోరు, కరణంగోరు వెళ్ళారామరి పంచాయితీకి?"

"ఆళ్లెళ్లి చాలా సేపయిందక్కడికి."

"అయితే నేనుకూడా వస్తాను పద" అంటూ పుల్లయ్య సుబ్బయ్యతో కలిసి శవం చూడటానికి కాల్వ దగ్గరకు వెళ్ళాడు.

కాలవ ఒడ్డున జనం గుంపులు గుంపులుగా మూగారు. మధ్య శవమూ, దానిచుట్టూ వెట్టివాళ్లు కాపలాఉన్నారు. మునసబు పంచాయతీ విచారణ జరిపిస్తున్నాడు.

శవం బాగా ఉబ్బివుంది. చూడటానికి చాల భయంకరంగావుంది. మొహమంతా గుర్తుపట్టడానికి వీలులేకుండా చాలా అసహ్యంగా చెక్కబడింది.

పంచాయితీ జరిపి పోలీసులు శవాన్ని ఆ ఊరికి దగ్గరగావున్న, సర్కారు ఆసుపత్రికి శవ పరీక్షకు పంపారు. కంపుకొడుతున్న ఆశవాన్ని వెట్టివాళ్లు ఒక మంచానికి కట్టుకుని అతిప్రయాస మీద, పదిమైళ్ళ దూరంలో ఉన్న సర్కారు ఆసుపత్రికి చేర్చారు.

శవం దొరికిన గ్రామానికి మూడు, నాలుగు మైళ్ళ దూరంలో భద్రయ్య అనే ఒక కాపున్నాడు. అతనికి నీలమ్మ అనే భార్య ఉంది. నీలమ్మకు సుమారు పాతికేళ్లుంటాయి. భద్రయ్యకు కూడా ముప్ఫైయేళ్లు దాటినయి. కొంత కాలంవరకు నీలమ్మ, భద్రయ్యల సంసారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా గడిచింది. కాని కొంతకాలానికి వాళ్ళ సంసారములో ముసలం పుట్టింది. నీలమ్మ చెడుతిరుగుళ్లు తిరుగుతున్నదని అభిప్రాయపడి నీలమ్మను నానా బాధలను పెట్టి కొట్టడం సాగించాడు భద్రయ్య.

ఈ బాధలుపడలేక నీలమ్మ ఒక మంచిరోజున ఇంట్లోనుంచి పలాయన మంత్రం చిత్తగించింది. అప్పటినుంచి ఆమె జాడలేదు.

కాల్వలో శవం దొరికిన మూడు రోజులకు సుబ్బయ్యా, పుల్లయ్యలు తిరిగి కలుసుకున్నారు.

"ఏం సుబ్బయ్యా, సంగతులేమిటి?"

"సంగతులేమున్నయ్యిగాని, శవం సంగతే ఇంకా పూర్తిగా తేలలేదు."

"అసలు శవం ఎవరిదో ఏమన్నా ఆచూకీ తీశారా?"

"పోలీసోళ్లు తలుచుకొంటే, ఆచూకీ దొరక్కపోయేదెట్టా?"

"అయితే వాళ్ళేమన్నా కనుకొన్నారంటావా?"

"ఫలానా అని అనుమానంగావుంది, అని రిపోర్టు వ్రాసుకొన్నారు?"

"ఎవరనేమిటి?"

"మన ప్రక్క ఊళ్లో భద్రయ్య కాపు నెరుగవూ?"

"ఆఁఆఁ! అతని లేచిపోయిన భార్యా!" నోరు తెరిచాడు పుల్లయ్య.

"అవునురా!"

"పోలీసులెట్లా కనుకొన్నారురా ఈ సంగతి? ఆమె లేచిపోయి చాలాకాల మయిందిగా?"

"అయిందిలే. శవం దొరికిన తర్వాత పోలీసోళ్లు ఈ చుట్టుప్రక్కల గ్రామాలలో అనుమానంగా వున్న కుటుంబాల సంగతి వాకబుచేశారట. శవం దొరికిన క్రిందటిరాత్రి, అర్ధరాత్రివేళ, భద్రయ్య, నీలమ్మను తీసుకొచ్చినట్టు ఋజువు దొరికిందట."

"ఎలా రుజువయిందేమిటి?"

"అర్ధరాత్రి భద్రయ్య వాళ్ళఊరికి రెండు మైళ్ళల్లోవున్న స్టేషనులో నీలమ్మతో, ఒక పెట్టెతోసహా దిగాట్ట. ఆ వూళ్ళో యెనాది పిచ్చాయి ఎవరితో స్టేషనుకు పంపించటానికి, స్టేషనుకు వచ్చాట్ట. సామాను మోయటానికి భద్రయ్య పిచ్చాయిని కుదుర్చుకొన్నాట్ట. భద్రయ్యతో ఉన్న మనిషి నీలమ్మేనని తను గుర్తుపట్టానని, పోలీసోళ్ళకు చెప్పాట్ట."

"పిచ్చాయికి పోలీసోళ్ళకు వెళ్ళి చెప్పేటంత అవసర మేమొచ్చింది అంట?" పుల్లయ్య 'లా' పాయింటు తీశాడు.

"అదీ చెప్తాను విను. తొందరపడతావేం? ఆ రాత్రి సామాను మోసుకొచ్చి భద్రయ్యను, నీలమ్మ ఇంట్లో దిగబెట్టాడట. మరునాడు పది గంటలకే మనఊళ్లో ఆడమనిషి శవందొరికింది."

"అయితే దానికీ, నీలమ్మకు సంబంధ మేమిటి?"

"భద్రయ్య నీలమ్మ లేచిపోకముందే, బాగా తన్నేవాడు, నానాభాధలు పెట్టేవాడు. ఆ సంగతి నీకు తెలుసుగా?"

"అవును." ఒప్పుకున్నాడు పుల్లయ్య.

"నీలమ్మ లేచిపోయినప్పటినుంచీ భద్రయ్య పగపట్టాడు. ఆమె దొరికితే చంపేస్తానని, అక్కడక్కడా అన్నట్టు ఆ వూళ్ళోవాళ్ళంటూరు."

"మరయితే ఆ రాత్రి నీలమ్మను భద్రయ్య ఎక్కడపట్టుకొన్నట్లు?" క్రాస్ ఎగ్జామిను చేశాడు పుల్లయ్య.

"ఆ సంగతి నీలమ్మకూ, భద్రయ్యకూ తెలియాల్సిందే. నీలమ్మ ఎలాగూ చచ్చిపోయింది గదా. ఇంక ఆ సంగతి తెలియాలంటే భద్రయ్య నడగాలి. అయితే పిచ్చాయి పోలీసోళ్ళకు ఈ సంగతంతా ఎందుకుచెప్పాడనిగదూ, నువ్వడిగేది. చెప్తున్నా. మరునాడు పదిగంటలకల్లా మనవూరి కాల్వలో శవందొరికిన సంగతివిని, అందరూ చూడటానికి వచ్చినట్టుగానే పిచ్చాయికూడా వచ్చాడు. మొహం గుర్తుపట్టడానికి వీలులేక పోయినా, ఆ శవం నీలమ్మదేనని గుర్తుపట్టాడు పిచ్చాయి."

"ఎలా గుర్తుపట్టాడంటావు?"

"నీలమ్మ ఆ కిందటిరాత్రి కట్టుకొన్న చీరే, పిచ్చాయికి, ఆ శవం నీలమ్మదేనని చెప్పింది."

"అయితే పిచ్చాయి ఆ సంగతి మునసబుతో అప్పుడే యెందుకు చెప్పలేదు?"

"అనవసరంగా ఈ వ్యవహారంలో చిక్కుకోడానికి పిచ్చాయికి యిష్టంలేదు. అసలు మొదట నీలమ్మే కాలవలోపడి, ఆత్మహత్యచేసుకొందే మోనని అనుకొన్నాట్టకాని. మొహమంతా చెక్కేసి ఉండటంవల్ల, ఆత్మహత్యకాదు, ఇది భద్రయ్య పనే అనుకొన్నాడట. పోలీసులు ఈ విషయం గూర్చి, వాళ్ళవూళ్ళో, ఆరాతీస్తుంటే, ఇంక ఉండబట్టలేక, ఇనస్పెక్టరుతో ఈ విషయమంతా రహస్యంగా చెప్పాడట."

"అయితే భద్రయ్యను పోలీసులడగలేదూ?"

"అడిగారు. కాని భద్రయ్య పిచ్చయ్య చెప్పినదంతా వట్టి అబద్ధం అన్నాడు. అయినా అనుమానంమీద అతన్ని అరెస్టుచేశారు వెంటనే."

"అయితే శవపరీక్ష చేసిన డాక్టరుగారేం చెప్పినట్లింతకీ?"

"డాక్టరుగారికి, శవంపొట్టలో విషమేదో ఉన్న సూచనలుకనిపించి, పొట్ట పేగులు మద్రాసుకు పంపించారుట పరీక్షకోసం."

"అయితే పోలీసోళ్ళు భద్రయ్యమీద కేసు జరుపుతున్నారా?"

"పైనుంచి రిపోర్టువచ్చేదాకా, వాళ్ళింక చేసే దేమీలేదుట."

"రిపోర్టు వచ్చేదాకా, ఏం తేలదన్నమాట."

అప్పటికి సంభాషణ చాలించి, వాళ్ళిద్దరూ ఎవరిదారినవారు వెళ్ళారు.

మరి రెండువారాలతర్వాత పుల్లయ్య, సుబ్బయ్యలు కలుసుకొన్నప్పుడు.

"అయితే సుబ్బయ్యా. నీలమ్మ కేసుసంగతేమన్నా తెలిసిందా?"

"నేను కనుక్కోకుండా వదిలిపెడితేగా తెలీకుండాపోడానికి?"

"అయితే యేం జరిగిందేమిటి?"

"పై అధికార్ల రిపోర్టు వచ్చిందట?"

"రిపోర్టులో ఏముందేమిటి?"

"నీదంతా పిచ్చిగాని పుల్లయ్యా, ఏముంటుందేమిటి? పొట్టపేగుల్లో విషం, గిషం ఏమీ లేదని రిపోర్టులో వ్రాశారు!"

"ఆఁ ఆఁ, అదేమిటి సుబ్బయ్యా. భద్రయ్య నీలమ్మని ఆరాత్రి కొట్టి బలవంతంగా విషంపెట్టి చంపి కాలవలో రాత్రికి రాత్రి పారేశాడని, ఊళ్ళో అంతా టాంటాం అయితే నీలమ్మ పేగుల్లో విషం కనపడలేదంటే నేను నమ్మతానా?"

"నువ్వు నమ్మేదేమిటోయి పుల్లయ్యా, పైఅధికార్లు పరీక్షచేసి రిపోర్టు వ్రాస్తుంటేను."

"ఐతే డాక్టరుగారు అభిప్రాయం ఏ మిచ్చినట్లు?"

"ఇంకా ఇవ్వడాని కేముంది. నీళ్ళలో మునగటంవల్ల చనిపోయిందని తన రిపోర్టులో అన్నాడు."

"అయితే భద్రయ్య బయట పడ్డట్టేనా!"

"ఆహా! భద్రయ్యమీద కేసు ఎగిరిపోయినట్టే."

"ఒక్క సంగతి నాకు చెప్పు సుబ్బయ్యా, ఇంత కుంభకోణం ఎలా జరిగిందంటావు? ఎక్కడ జరిగిందంటావు?"

"పుల్లయ్యా, ఈ గ్రామంలో కూర్చొన్న మనకు మూడువందలమైళ్ళ దూరంలో ఉన్న మద్రాసులో సంగతు లెలా తెలుస్తాయి?"

"ఏమీ తెలీవంటావు?"

"మద్రాసులో సంగతులు తెలీవు అన్నాను గాని మన ప్రక్కగ్రామంలో జరిగిన ఒక సంగతి మాత్రం నాకు తెలుసు."

"ఏమిటది?" చెవు లురిక్కించుకొని వింటున్నాడు పుల్లయ్య.

"భద్రయ్య పదిరోజుల క్రిందట తనకున్న మూడు ఎకరాలలో ఒక యెకరం పొలం మూడు వేలకు అమ్మేసాట్ట. దమ్మిడీకూడా మిగలకుండా ఖర్చుపెట్టేసాట్ట."

పుల్లయ్య కొద్దిసేపు ఆలోచించి, "అంతపని జరిగిందంటావా సుబ్బయ్యా?" అన్నాడు.

"ఇంకా సందేహపడుతున్నావా? అందుకనే పుల్లయ్యపేరు నీకు సార్థకంగా కనపడుతోన్నది" అన్నాడు సుబ్బయ్య.

నీలమ్మ ఆత్మహత్య చేసుకొన్నదని, పోలీసులు తమ కేసును విత్‌డ్రా చేసుకొన్నారు.

ప్రపంచం మొత్తంమీద నిరుడుకంటె యీ సంవత్సరం పండిన పంటలు కొంచెం ఎక్కువే అయినప్పటికీ ప్రజానీకానికి చాలినంత ఆహారం పండించబడిందని చెప్పడానికి వీలులేదని ప్రపంచ ఆహార వ్యవసాయసంస్థ ప్రకటించింది. ఇందుకు కారణం-పంటలు నూటికి రెండువంతులు హెచ్చుగా పండినప్పటికీ, అవి వ్యాపారపు పంటలుగాని ఆహారధాన్యాలు కావటం.